క్లుప్తంగా

చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు



వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్య అభ్యసిస్తున్న చిన్నారులకు గురువారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు పుల్గర్‌చర్ల, సంగినేనిపల్లి, బొల్లారం తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల బరువులను తీసి వారి ఆరోగ్య రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని పెద్ద గూడెంతండాలో గురువారం చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఎంపీడీఓ రాఘవ పరిశీలించారు. గ్రామంలో డ్రెయినేజీలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ నర్సరీని సందర్శించి, మొక్కల పెరుగుదలకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి రామచంద్రయ్య పాల్గొన్నారు.

గొర్రెల కాపరికి నష్ట పరిహారం



వీపనగండ్ల: మండలంలోని పోచమోని వెంకటస్వామి అనే గొర్రెల కాపరికి చెందిన గొర్రెలు ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందాయి. విషయం తెలుసుకున్న మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలతో విద్యుత్ శాఖ నుంచి వచ్చిన రూ.28 వేల నష్ట పరిహార చెక్‌ను బాధిత కాపరికి గురువారం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రమేష్‌గౌడ్, రాముడు, శ్రీను పాల్గొన్నారు.

మండల సభ వాయిదా

ఆత్మకూర్: ఈనెల 28న జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఎంపీడీఓ సుజాత తెలిపారు. త్వరలోనే సమావేశం నిర్వహించే తేదీని వెల్లడిస్తామన్నారు.

ట్రాక్టర్లు, ప్రొక్లెయిన్ల పట్టివేత

ఖిల్లాఘనపురం: మండలంలోని ఆముదంబండతండా శివారులో అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, రెండు జేసీబీలను పట్టుకున్నామని ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. మట్టిని తరలించి ఫిల్టర్ చేసి ఇసుక తయారు చేసి విక్రయిస్తున్నారని సమాచారం తెలియడంతో అక్కడికి వెళ్లి పరిశీలించామన్నారు. అక్కడ బిజినేపల్లి మండలంలోని లట్టుపల్లికి చెందిన రెండు ట్రాక్టర్లు, ఓ జేసీబీ, మామిడిమాడకు చెందిన మరో జేసీబీని అదుపులోకి తీసుకుని తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. పోలీసులు పట్టుకుని అప్పగించిన ట్రాక్టర్లు, జేసీబీలను ఆర్‌డీఓకు అప్పగించినట్లు తహసీల్దార్ పాండు తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కొల్లాపూర్: నిరుద్యోగులు శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని రత్నగిరి ఫౌండేషన్ ట్రస్టీ జూపల్లి జగన్మోహన్‌రావు, కన్వీనర్ కేతూరి ధర్మతేజలు అన్నారు. నియోజకవర్గానికి చెందిన యువతులు హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్‌లో గల అకుషాపూర్‌లో డ్రోన్ పైలెట్ శిక్షణ పొందుతున్నారు. రత్నగిరి ఫౌండేషన్ ద్వారా తారా యూఏవీ ప్రైవేట్ లిమిటెడ్ వారు నియోజకవర్గానికి చెందిన 30 మంది యువతులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా వారు శిక్షణా కేంద్రాన్ని వారు సందర్శించారు. యువతులకు కల్పిస్తున్న వసతీ, సౌకర్యాలను పరిశీలించారు. శిక్షణ పూర్తిచేసుకున్న యువతులకు ప్రభుత్వ సహకారంతో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడతామని వారు పేర్కొన్నారు.

కొనసాగుతున్న భవన నిర్మాణ పనులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ కార్యాలయం భవన నిర్మాణం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గత 40 సంవత్సరాలు తహసీల్దార్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. మాజీ ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్‌రెడ్డి తహసీల్దార్ భవన నిర్మాణం కోసం రూ.1.70 కోట్లు మంజూరు చేయించారు. దీంతో పాత పోలీసు స్టేషన్ స్థలంలో తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణం చేపట్టారు. మరో రెండు నెలల్లో కొత్త భవనంలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

‘బీటీ’కి మోక్షమెప్పుడో?

- ఏళ్లు గడుస్తున్నా గూడెం ప్రజల కల
- నిధులు మంజూరైౖ అసంపూర్తిగా వదిలేసిన వైనం



కంకర పరిచి వదిలేసిన గూడెం రోడ్డు

చిన్నంబావి: ప్రభుత్వాలు మారుతున్నా గూడెం గ్రామ ప్రజల కష్టాలు మాత్రం మారడం లేదు. మండల కేంద్రానికి చేరుకోవాలంటే గూడెం గ్రామ ప్రజలు నరకయాతన పడుతున్నారు. 2017 సంవత్సరంలో దాదాపుగా రూ.ఐదు కోట్లతో హంగు ఆర్భాటలతో బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి అప్పటి మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. గ్రామ ప్రజలు, వాహనదారులు తమ చిరకాల కల నేరవేరుతుందని, గుంతల రోడ్డుపై ప్రయాణం చేసే బాధ తీరుతుందని సంతోషించారు. టెండర్ పూర్తి చేసి 2017 సంవత్సరంలో పనులు ప్రారంభించారు. రోడ్డును తవ్వి కంకర పరచి సదరు కాంట్రాక్టర్ పనులను మధ్యలో వదిలేశారు.

నిత్యం ప్రమాదాలు..

రోడ్డు తవ్వి కంకర, డస్ట్ వేసి అసంపూర్తిగా వదిలేయడంతో దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. రహదారిపై ప్రజలు నడవలేక, అటు వాహనాల వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. కంకర తేలడంతో ద్విచక్ర వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇదే రహదారిపై అనేక సార్లు అదుపు తప్పి కింద పడిన గాయాలపాలైన ఘటనలు చాలా ఉన్నాయని స్థానికులు తెలిపారు.

కాశిరెడ్డివాగుపై వంతెన కలేనా..

మండల కేంద్రం నుంచి గూడెం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపైనే కాశిరెడ్డి వాగు ఉండటంతో వర్షాకాలం కృష్ణానది నీరు ఇదే వాగులోకి వస్తుంది. దీంతో ఈ వాగు దాటాలంటే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో నిధులు మంజూరైన సాంకేతిక కారణాలతో బ్రిడ్జి పనులు ప్రారంభం కాలేదు. గతంలో ఇదే వాగులో ఆర్టీసీ బస్సు ఇరుక్కుపోయిన ఘటన చోటు చేసుకుంది. ఈ ఏడాదైనా పనులు ప్రారంభించి రోడ్డు ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా కాశిరెడ్డివాగు

మంత్రిపైనే ఆశలు..

గతంలో జూపల్లి మంత్రిగా ఉన్న సమయంలోనే గూడెం రహదారికి బీటీ, కాశిరెడ్డి వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన ఓడిపోవడంతో పనులకు ఆటంకం ఏర్పడింది. కానీ ఇప్పుడు మళ్లీ మంత్రిగా జూపల్లి కృష్ణారావు కొనసాగుతుండటంతో ఈ రెండు దీర్ఘకాలిక సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఎదురుచూస్తున్నాం



ఎన్నో ఏళ్లుగా గూడెం రోడ్డు, కాశిరెడ్డి వాగు బ్రిడ్జి నిర్మాణం కోసం ఎదురుచూస్తున్నాం. ఈ రోడ్డు పూర్తయితే మండల కేంద్రానికి ఐదు నిమిషాల్లోనే చేరుకుంటాం. గతంలో పనులు మధ్యలోనే వదిలేయడంతో బైక్‌లపై వెళ్లలేకపోతున్నాం. మంత్రి జూపల్లి ప్రత్యేక దృష్టితో రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తే బాగుటుంది.

– మహేష్, గూడెం గ్రామం

‘హరిత’ లక్ష్యం చేరుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కోటేశ్వర్

పాన్‌గల్: హరితహారంలో భాగంగా జీపీలకు ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు సిద్ధం చేయడంతో పాటు గుంతలను పూర్తి చేయాలని ఎంపీడీఓ కోటేశ్వర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీలకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించిన అన్ని రికార్డులను తనిఖీ చేసేందుకు కేంద్ర కమిటీలు పర్యటించనున్నందున ఆయా రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏపీఓ కుర్మయ్య, ఈసీ అంజన్‌రెడ్డి, ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి

ఆత్మకూర్: గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి వర్షాకాలంలో శానిటేషన్, ఇంకుడుగుంతలు, హరితహారం, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండల ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఆత్మకూర్, మదనాపురం మండలాల ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు లేని కుటుంబాలను గుర్తించి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామానికి నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు చొరవ చూపాలని ఆదేశించారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్‌తో పాటు దోమల నివారణ కోసం మందులను పిచికారీ చేయాలన్నారు. సమావేశంలో మదనాపురం మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున్, ఆత్మకూర్ ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ నరసింహారావు, ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

హెచ్‌సీయూ వీసీ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

వనపర్తిటౌన్: స్టూడెంట్ యూనియన్ హక్కుల కోసం నిరసనలు చేస్తే సస్పెండ్‌లు చేసి, జరిమానాలు కట్టించుకుంటారా అని హెచ్‌సీయూ వీసీ నిర్ణయంపై ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.ఆది ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో వీసీ గెస్ట్ హౌస్ ఎదుట స్టూడెంట్స్ యూనియన్ హక్కుల కోసం నిరసన తెలిపినందుకు అధ్యక్షుడు, విద్యార్థి సంఘాల, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మొత్తం ఐదుగురిని క్యాంపస్ నుంచి సస్పెండ్ చేశారని మండిపడ్డారు. అందుకు నిరసనగా గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో హెచ్‌సీయూవీసీ దిష్టిబొమ్మను ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిరసన చేసినందుకు ఐదుగురిని సస్పెండ్ చేసి, మరో ఐదుగురు విద్యార్థులకు రూ.10వేల జరిమానా వేసిందని దుయ్యబట్టారు. సస్పెండ్ చేసిన, నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీస్ కేసులు పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే విశ్వవిద్యాలయంలో 8ఏళ్ల క్రితం రోహిత్ వేములను ఇదే రకంగా వెలివేసి అతడి ఆత్మహత్యకు కారణమయ్యారని ఆరోపించారు. తక్షణమే విద్యార్థులపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి, సభ్యులు భరత్, సాయి, కుమార్, స్వాములు, వెంకటేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

ఖిల్లాఘనపురం: మండలంలోని ఆగారంలో నూతనంగా నిర్మించే డ్రెయినేజీ పనులను గురువారం మండల యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు జయకర్ గ్రామ పెద్దలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.6 లక్షలు మంజూరయ్యారని తెలిపారు. ఈ నిధులతో గ్రామంలోని బాలయ్య ఇంటి నుంచి నర్సింహ ఇంటి వరకు మురుగు కాల్వ నిర్మాణం చేపడతామన్నారు. నిధులు వృథా కాకుండా నాణ్యతతో పనులు జరిగేలా చూస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కృష్ణయ్య, శ్రీకాంత్‌రెడ్డి, బీరయ్య, కుర్మయ్య, గోవర్ధన్‌రెడ్డి, బాలమల్లయ్య, చంద్రశేఖర్, శాంతయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేట్ ఫైనాన్షియర్ టోకరా



డీటీకి వినతిపత్రం ఇస్తున్న గోవర్ధనగిరి గ్రామస్తులు

వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరికి చెందిన బొలమోని ఆంజనేయులు అనే ఫైనాన్స్ వ్యాపారి గ్రామంలోని 22 మంది నుంచి డబ్బులు తీసుకొని పారిపోయాడని, అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గురువారం పలువురు బాధితులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పెబ్బేరు పట్టణంలో ఫైనాన్స్ కంపెనీ నిర్వహిస్తున్నానని నమ్మబలికి గ్రామంలోని 22 మందితో డబ్బులు వసూలు చేసి పారిపోయాడని బాధితులు గూడెం సాయిలు, విజయ్‌కుమార్, ఆకుల బీసన్న, మదుగం కురుమన్న, కొత్తం లక్ష్మయ్య, ముంత కురుమన్న, రాముడు, చంద్రమ్మ డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తికి వివరించారు. తమ గ్రామంలోనే దాదాపు రూ.80 లక్షల వరకు వసూలు చేశారని వారు పేర్కొన్నారు. గ్రామంలోని పేద రైతులు, కూలీలను మోసం చేసి డబ్బులు తీసుకొని ఉడాయించిన ఆంజనేయులుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు.

మొక్కల పెంపకంపై అవగాహన పెరగాలి

- అడ్డాకులకు చేరిన కృష్ణసాగర్ పాదయాత్ర



పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న స్థానికులు

అడ్డాకుల: వనపర్తి పట్టణానికి చెందిన సాగర్ స్నేక్ సొసైటీ వ్యవస్థాపకుడు చీర్ల కృష్ణసాగర్ చేపట్టిన పాదయాత్ర గురువారం అడ్డాకులకు చేరుకుంది. ‘మొక్కలు నాటండి...పర్యావరణాన్ని కాపాడండి’ అనే నినాదంతో అలంపూర్ జోగులాంబ ఆలయం నుంచి హైదరాబాద్‌కు చేపట్టిన పాదయాత్ర 44వ నంబర్ జాతీయ రహదారిపై పెబ్బేర్, కొత్తకోట మీదుగా అడ్డాకులకు చేరింది. మార్గమధ్యలో కృష్ణసాగర్ కాలుష్యాన్ని నివారించి పర్యావరణాన్ని కాపాడాలని ప్రచారం చేస్తూ రోడ్డు పక్కన మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో రహదారి సమీపంలోని గ్రామాల ప్రజలను భాగస్వాములను చేయడం ద్వారా మొక్కల పెంపకం అవశ్యకతపై విస్తృత ప్రచారం సాగుతోంది. శుక్రవారం అడ్డాకుల నుంచి మొదలై శాఖాపూర్, కొమిరెడ్డిపల్లి, మూసాపేట, జానంపేట మీదుగా పాదయాత్ర అన్నాసాగర్ చేరుకోనుందని కృష్ణసాగర్ తెలిపారు. అడ్డాకులలో పాదయాత్రకు సింగిల్‌విండో అధ్యక్షుడు ఎం.జితేందర్‌రెడ్డి, ఎంపీటీసీ రంగన్నగౌడ్, విజయమోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దానేలు, మేఘనాథ్, వెంకటేష్, శ్రీనివాస్ యాదవ్, బాలరాజు తదితరులు స్వాగతం పలికారు.

నాలుగేళ్లకే కూలిన సీలింగ్



మున్సిపల్ లోపల కూలిన ఫాల్ సీలింగ్



అమరచింత మున్సిపల్ కార్యాలయం

- రూ.40లక్షలతో మున్సిపల్ కార్యాలయ మరమ్మతు పనులు
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణం

అమరచింత: మున్సిపల్ కార్యాలయం కోసం పట్టణంలోని పీఏసీఎస్‌కు చెందిన గోదాంను వినియోగించుకునేందుకు మున్సిపల్ కార్యాలయం నుంచి రూ.40 లక్షలు వెచ్చించారు. పాత గోదాంను సరికొత్త భవనంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేసిన పాల్ సీలింగ్ నాలుగేళ్లకే కూలిపోవడంతో అధికారుల పనితనానికి నిదర్శనమని పట్టణ ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. రూ.40 లక్షలతో ప్రభుత్వ స్థలంలో కొత్త మున్సిపల్ కార్యాలయమే నిర్మించే అవకాశం ఉన్నా.. పాలక మండలి సభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆజ్ఞతో రూ.40 లక్షలు మంజూరు చేసి సదరు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కయ్యారనే ఆరోపణలను మూడవ వార్డు కౌన్సిలర్ బాహటంగానే చేసినా పట్టించుకునే అధికారులే కరువయ్యారు. అతుకుల భవనంగా తయారైన మున్సిపల్ కార్యాలయ మరమ్మతులపై సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కనిపించని బ్లీచింగ్..

పట్టణంలో పారిశుద్ధ్య పనులు చేసేందుకు మురికివాడల్లో చల్లుదామనుకున్న బ్లీచింగ్ పౌడర్ నిల్వలు కార్యాలయంలో లేకపోవడంతో సున్నం చల్లి చేతులు దులుపుకుంటున్నారు. పక్కనే ఉన్న ఆత్మకూర్ మున్సిపాలిటీలో బ్లీచింగ్ పౌడర్ అందుబాటులో ఉందనే సమాచారంతో అమరచింత మున్సిపల్ అధికారుల విన్నపం మేరకు మూడు సంచుల బ్లీచింగ్ పౌడర్ ఇచ్చినట్లు తెలిసింది. అధికారులు స్పందించి వానాకాలంలో పరిసరాలు అపరిశుభ్రంగా మారక ముందే పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించి బ్లీచింగ్‌ను కొనుగోలు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రైతులకు రూ.2 లక్షల పంట రుణమాఫీ



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌నాయుడు

మానవపాడు: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్‌మోహన్‌నాయుడు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు బస్సు ఫ్రీ, రూ.500కు గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి కింద 200యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేస్తోందని, రైతులకు రూ.2లక్షలు తప్పనిసరిగా ఆగస్టు లోపల కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని తెలిపారు. రైతులకు రైతుబంధు కింద పెట్టుబడి సాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో నారాయణనాయుడు, శంకర్‌నాయుడు, చంద్రమౌళి, ఖలీల్‌భాషా పాల్గొన్నారు.

పుష్కరఘాట్లలో రక్షణేది?

- వరద ఉధృతికి కొట్టుకుపోయిన ఇనుప కంచెలు
- ప్రమాదాల బారిన పడుతున్న భక్తులు
- పట్టించుకోని అధికారులు



కృష్ణమ్మ విగ్రహం చుట్టూ ధ్వంసమైన ఇనుపకంచె.

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కృష్ణానది దగ్గర పుష్కరఘాట్లలో భక్తుల రక్షణ కరువైంది. ఇనుప కంచెలు వరదల వల్ల గతంలో పూర్తిగా ధ్వంసమై కొట్టుకుపోయాయి. దీనివల్ల పుష్కరఘాట్లన్నీ భక్తులకు రక్షణ లేకుండా మారాయి. దీనివల్ల పుష్కరఘాట్లు నిత్యం ప్రమాదాలకు తావునిస్తూ ప్రమాద భరితంగా ఉండటంతో అక్కడికి వచ్చే భక్తులు ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవికాలంలో నిర్వహించే బీచుపల్లి ఆంజనేయస్వామి ఉత్సవాలతో పాటు వినాయక నిమజ్జనం ఉత్సవాలకు వేల సంఖ్యలో భక్తులు ఇక్కడికి వస్తుంటారు. పుష్కరఘాట్లలో సరైన భద్రత లేకపోవడంతో ఎంతో మంది యువకులు ప్రాణాలను కోల్పోయారు. కానీ ఎన్ని ప్రమాద సంఘటనలు జరిగినా అధికారుల తీరులో మాత్రం ఎలాంటి మార్పు రాలేదని భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం వందల సంఖ్యలో భక్తులు రాక..

బీచుపల్లి పుణ్యక్షేత్రంలో అభయాంజనేయస్వామి, కోదండ రామస్వామి, /జ్ఞాన సరస్వతి ఆలయాలతో పాటు శివాలయం , ప్రముఖమైన పలు ఆలయాలు ఉండటంతో నిత్యం వందల సంఖ్యలో భక్తులు బీచుపల్లి క్షేత్రానికి వస్తుంటారు. వచ్చిన భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆయా ఆలయాలలో మొక్కులు తీర్చుకొని వెళ్తుంటారు. పుష్కరఘాట్లలో స్నానాలు చేసే దగ్గర, కృష్ణమ్మ విగ్రహం దగ్గర రక్షణకోసం ఏర్పాటు చేసిన ఇనుపకంచెలు సక్రమంగా లేకపోవడంతో ప్రమాదాలు తప్పడం లేదని భక్తులు వాపోతున్నారు. ప్రతి ఏటా నెల రోజులపాటు అంగరంగవైభవంగా నిర్వహించే బీచుపల్లి జాతర సమయంలో, వినాయక నిమజ్జనం సమయంలో భక్తులు వేల సంఖ్యలో రావడంతో ప్రమాదాలు సంభవించిన సంఘటనలు చాలానే ఉన్నాయి.

అధికారులు పట్టించుకోవడంలేదు..

పుష్కరఘాట్లలో ఇనుప కంచెలు లేకపోవడం వల్ల పలుమార్లు ప్రమాదాలు జరిగి భక్తులు ప్రాణాలు కోల్పోయినా అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు స్థానిక ప్రజా ప్రతినిధులకు, ఆలయ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని భక్తులు పేర్కొంటున్నారు. వరదల తర్వాత కంచెలను ఏర్పాటు చేయకపోవడంతో నదిలో స్నానాలు ఆచరించేందుకు వచ్చిన భక్తులకు రక్షణ కరువైందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పుష్కరఘాట్లలో ఇనుపకంచెలను ఏర్పాటు చేసి భక్తులు ప్రమాదాల బారిన పడకుండా రక్షణ కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

ప్రమాదాల బారిన పడుతున్నారు..



పుష్కరఘాట్ దగ్గర ఇనుప కంచెలు సక్రమంగా లేకపోవడంతో యువత అధికంగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా వినాయక నిమజ్జనం రోజు రాత్రివేళల్లో భక్తులు అధికంగా రావడంతో రక్షణకు ఏర్పాటు చేసిన ఇనుప కంచెలు లేకపోవడంతో గమనించక ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. కొంతమంది యువకులు ఘాట్లలో సెల్ఫీలను దిగుతూ రక్షణ కంచెలు లేకపోవడంతో ప్రమాదంలో పడి ప్రాణాలను సైతం పోగొట్టుకున్నారు.

– నరేష్, భక్తుడు.

రక్షణ కంచెలను ఏర్పాటు చేయాలి...



పుష్కరఘాట్లలో వరదల కారణంగా భక్తుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన కంచెలు పూర్తిగా కొట్టుకుపోవడం వల్ల భక్తులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి ఆదివారం సెలవు ఉండడంతో చుట్టు పక్కల ప్రాంతాల నుంచి పర్యాటకులు కుటుంబ సభ్యులతో కలిసి అధికంగా వస్తుంటారు. భక్తుల రక్షణకోసం తక్షణమే అధికారులు ఇనుప కంచెలను ఏర్పాటు చేసి పుష్కరఘాట్లలో ప్రమాదాల నివారణకు కృషిచేయాలి.

– అశోక్‌కుమార్‌రెడ్డి, భక్తుడు.

అధికారులకు విన్నవించాం..



పుష్కరఘాట్లలో ఇనుప కంచెలు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలుమార్లు స్థానిక రెవెన్యూ అధికారులతో పాటు జిల్లా అధికారులకు కూడా గతంలో విన్నవించాం. కానీ ఇప్పటి వరకు అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ప్రమాదాలు మాత్రం తరుచుగా జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే భక్తులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలి.

– నర్సమ్మ, మాజీ సర్పంచ్, బీచుపల్లి